
# రేపు



సీయస్సీ మురళి
Claremont, CA

సుధ, జ్యోతి నీలంపరికిణీలు, తెల్లజాకెట్లు తొడుక్కుని గేటు దగ్గర నిలబడ్డారు. వాళ్ళభుజాల మీదనించి అందమైన పుస్తకాల సంచులు వేళ్ళాడుతున్నాయి. వాళ్ళ వెనకే రెండు టిఫిన్ కారియర్లు పట్టుకుని సులోచన వచ్చింది.

"రాజులు ఇంకా రాలేదు, చూడమ్మా!" అని ఫిర్యాదు చేసింది జ్యోతి.

"వస్తాడుండవే. పాపం, అంత దూరం నుండి రావద్దేమిటి" అంది సుధ.

పిల్లలిద్దరి మాటలూ వినిపించుకోకుండా రోడ్డు చివరికి చూస్తోంది సులోచన.

రాజులు రిక్షా కనిపించలేదు. గడియారం చూసింది. పావు తక్కువ పది.

ఓ అయిదు నిమిషాలు చూడండే. అప్పటికీ రాకపోతే ఈ రోజుకి...."

"బడి మానెయ్యమంటావా, అమ్మా?" అంది సుధ.

"అబ్బ, నే మాననబ్బా. ఇవాళ మా పరిమళ కొత్తపలక చూపిస్తానంది. వాళ్ళ మామయ్య జర్మనీ నించి పంపించాట్ట. ఎందరు రాసినా, చెరిపితే శుభ్రంగా అయిపోతుందిట. ఉమ్మి పెట్టి తుడవనక్కర్లేదట..." అంటూ లొడలొడ మొదలు పెట్టింది జ్యోతి.

"ఉమ్మి పెట్టి తుడుపుతారేమిటి? అబ్బ! ఛీ" అంది సుధ.

"మా ఇష్టమబ్బా" అని జ్యోతి అందుకుంది.

"అప్పటికీ రాకపోతే మరో రిక్షా ఎక్కి వెళుదురుగాని...." అని తన మాట పూర్తిచేసింది సులోచన.

"నాకసలే కడుపు నొప్పిగా ఉంటేనూ" అంటూంది సుధ.

ఇంతలో, "అదిగో, రాజులు రిక్షా వచ్చేస్తోంది" అంటూ అరిచింది జ్యోతి.

సుధ నీళ్ళు కారిపోయింది. "కడుపు నెప్పి బడికెళితేనే తగ్గుతుంది, సుధా!" అని నవ్వింది సులోచన.

"నువ్వేం చెప్పనక్కర్లేదు పో." ఉడుక్కుంది సుధ.

గలగలలాడుతూ వచ్చి ఆగింది రాజులు రిక్షా.

"నువ్వు ఆలస్యం చేశావని అమ్మాయిగోర్లు విసుక్కుంటున్నారు, రాజులూ!" అంది సులోచన నవ్వుతూ.

"ఏ అమ్మాయిగోరండీ? జోతమ్మ గోరేనా? సుదమ్మగోరు నే నొచ్చానని యిసుక్కుంటారండి" అన్నాడు రాజులు సుధ బుగ్గ గిల్లి.

"నా బుగ్గమీద ఎవరూ ఏం గిల్లక్కర్లేదు" అంది సుధ.

గొల్లున నవ్వాడు రాజులు.

రాజులు వయస్సు అరవైకి తక్కువ ఉండదు. తలమీద మాసిన తెల్ల తలపాగా. గుబురుగా ఉన్న నెరిసిన మీసాలు. నెరిసిన కను బొమ్మలు. పైపళ్ళు చాలా మటుకు ఊడిపోయాయి. మోకాళ్ళ వరకు గోచీపోసి కట్టిన పంచె. పరకా గుడ్డతో చంకలవరకూ కుట్టిన బనీను. నడుం దగ్గర లోపలివైపు ఆ బనీనుకో జేబు. ప్రత్యేకించి మాసి ఉంది ఆ ప్రాంతం. కుడిచేతిమీద చిన్నప్పుడెప్పుడు వేయించుకున్నాడో ఓ పచ్చబొమ్మ. సంజీవి పర్వతం మోస్తున్న హనుమంతుడి బొమ్మ అది. ఎడంచేతి దండమీద తాయీదు ఒకటి నల్లటి తాడుతో బిగించాడు. ఒళ్ళంతా ముడతలు పడలేదు గానీ పెద్ద బలంగా లేడు రాజులు.

సుధ. జ్యోతి రిక్షా ఎక్కలేదు. గేటుదగ్గిరే నించుని రిక్షాలో కూర్చున్న—ఓ అయిదేళ్ళుంటాయేమో - కుర్రాడి వేపు కొత్తగా, అనుమానంగా చూస్తున్నారు.

నవ్వడం, ఆపి ఆ కుర్రాడి కేసి చూపిస్తూ అన్నాడు రాజులు:

"ఈ అబ్బయ్‌గోరి మూలానే నమ్మా ఇవాళ ఆలీశమయింది."

"ఎవరబ్బాయి, రాజులూ? కొత్తగా వచ్చినట్టున్నాడే" అంది సులోచన ఆ కుర్రాడికేసి చూస్తూ. గోధుమరంగులో ఉన్నాడు కుర్రాడు. నల్లటిజుట్టు చక్కగా పాపిడి తీసి దువ్వి ఉంది. జ్యోతుల్లాగా, విశ్వాసంతో, పెంకితనంతో మెరుస్తున్న నల్లని, గుండ్రని కళ్ళు. నీటుగా నీలం నిక్కరు మీద తెల్ల చొక్కా వేసుకున్నాడు. తెల్లని మేజోళ్ళు మోకాళ్ళ వరకూ ఉన్నాయి. ఎరుపు రంగు బూట్లు చక్కగా నిగనిగ మెరుస్తున్నాయి.

సులోచన కళ్ళలో కళ్ళు కలిపి చనువుగా, పొగరుగా నవ్వాడు.

"ఎవరు, రాజులూ, ఈ కుర్రాడు! మాంచి గడుసువాళ్ళా ఉన్నాడే! ఎంత ధైర్యంగా నవ్వుతున్నాడో చూడు" అంది సులోచన ముచ్చట పడుతూ.

"అమ్మా, చూడే! మా కేసి చెయ్యి ఎలా ఊపుతున్నాడో!" అంది జ్యోతి, ముందరి బెరుకు మాని రిక్షా వైపు నడుస్తూ. సుధ మాత్రం కదలలేదు.

"ఆడేనామ్మా? అబ్బో. మా సెడ్డ గడుసులేండి. ఆరి నాన్నగారేమో—అదేదో పెద్ద ఉద్యోగమేనండి. అవతల ఊదికి రెండీదులు ఆవలుంటారండి. అమ్మగోరి పేరేమో సిన్నదొరసానండి. అవతల ఊదిలో ఆరి నెరగనివోరే లేరండి. మా సెడ్డ మంచోరండి. ఇక నీ అయ్యగోరి పేరేమిటని అడగరేటండి. రామ్‌చెంద్ నెహ్రూ గాంధీ అంటండి...."

"హాస్యాలాడుతున్నావ్ రాజులూ, నువ్వు. చిన్నదొరసాని ఏమిటి? అదేం పేరు?" అంది సులోచన నవ్వి.

"నా కేం తెలీదండి. ఆ బాబుగోరినే అడగండి కావాలంటే. ఆమె గోరికి పొద్దున్న, సాయంత్రం ఒక్క ఛనం తీరదండి. ఇంటో పని ఎపుడు సేస్తారని అడగమాకండి. ఉదయాన లెగిస్తే ఆరింటి కెల్లా ఈరింటి కెల్లా. ఆరికీ ఈరికీ బోలెడంత సాయం సేస్తారండి. ఇక నీ అబ్బాయిగోరు లేరండీ .... ఈరు పెద్ద వోరై సేరామచెందురుడిలా గాంధీ మహాత్ముడిలా, మరి నెహ్రూ బాబుగోర్లా పెద్దోరై పోవాలని ఆరి తాతగారికి మా సెడ్డ కోరిక లెండి. అయ్‌నే ఎట్టారండి ఈరికీ పేరు. ఈరి తాతగోరు పెద్దోరై పోయారండి. తల నెరిసిపోయింది అయినా గట్టి పిడుగులా గుంటారండి. ఈ రిచ్చా లేదండి దీన్ని సులాగ్గా లాగెయ్యగల్రండి...."

"నువ్వు మాత్రం ముసిలాడివి కాదా, రాజులూ! నువ్వులాగటం లేదూ రిక్షా?" అంది సులోచన సానుభూతిగా.

"అమ్మమ్మమ్మమ్మమ్మ. నాదేం ఉందండమ్మగోరూ. కూలిపని సేసుకునేందుకు పుట్టానండి నేను. ఊరికే ఆరి సతువు గురించి సెప్పానండి. ఆరికేం? మా రాజులు కారండీ ఆరు. ఈ అబ్బయ్‌గోరు పెద్దయి టోల్లు సంపాదించి. రెపు ఆరిని నెత్తిమీద పెట్టుకుని తిరగరంటండి .... ఆరికీ

నాకూసాపత్యం ఉందదండి" అంటూ సుధని రెండు చేతులతోనూఎత్తుకుని రిక్షాలో కూర్చోపెట్టాడు రాజులు.

వెళ్ళబోతున్నవాడల్లా ఆగి, "అమ్మగోరూ! ఈ అయ్యగోరు సూడంటే అని ఏదో అనబోయాడు రాజులు...."

"అబ్బ! మాకు లేటయ్‌పోతుంటే చూడమ్మా" అని విసుక్కుంది జ్యోతి.

"అమ్మమ్మ. ఇదుగో, ఎల్లిపోదాం, తల్లీ!" అని రిక్షా ఎక్కి తొక్కుతూ వెళ్ళిపోయాడు. రాజులు.

రిక్షా వెళ్ళినవంకే చూస్తూ నిలబడింది సులోచన. రిక్షా సందు చివర మలుపు తిరిగాక నవ్వుకుంటూ లోపలికి వెళ్ళింది.

"రామ్‌చంద్ నెహ్రూ గాంధీ!" ఆ పేరు తలుచుకుంటేనే ఆమెకు నవ్వు వస్తూంది 'చిన్నప్పుడు ఈ తాత ఎవరో ముచ్చటపడి పెట్టాడు గాని పెద్దయితే వాడా పేరు ఉంచుకుంటాడేమిటి? ఉంచుకుంటే, తోటి వాళ్ళందరూ వాణ్ణి గేలిచేసి ఏడిపించరూ? అయినా ఎంత అర్థం ఉంది ఆ పేరులో! ఎంత ఆశ! రేపు వాడి జీవితం ఎంతో అర్థవంతంగా, మనోహరంగా ఉండాలనే కాంక్ష!"

ఆ కుర్రాడు చిలిపిగా నవ్వి పలకరించిన పద్ధతే సులోచనకి చాలా ముచ్చటగా అనిపించింది.

అలాంటి కుర్రవెధవ తనకూ ఒకడుంటే....ఆ తరువాత సులోచన తేలిగ్గా ఆలోచించలేకపోయింది. ఆమెకు మళ్ళీ ఆ అదృష్టంలేదని తెలుసు. మరో కాన్పు మృత్యువవుతుందని డాక్టరు చెప్పిన విషయం. సాయంత్రం దాకాఅదేఆలోచన మెదిలింది సులోచన మనసులో. అయిదుగంట లయేసరికల్లా సందు చివరికి చూస్తూ వీధిలో నిలబడింది. అలా నిలబడడం ఆమెకు మామూలు కాదు. ఆ కుర్రాణ్ణి చూడాలని తనెందుకింత తహతహలాడుతున్నానా అని ఆశ్చర్యపడింది — సులోచన. తనలో ఇలాంటి బలహీనత ఏమిటని విసుక్కుంది. అయినా, అక్కడ నిలబడకుండా ఉండలేకపోయింది.

రాజులు రయ్యిన రిక్షాతో వచ్చి ఆగాడు.

"రామూ? రేపు వస్తావా?" అని అడిగారు కిందికి దిగిన జ్యోతి, సుధ. అప్పటికే ముగ్గురూ పెద్ద స్నేహితులై పోయారు.

"వస్తాను!" అని తల వూపాడు వాడు.

"పోనీ బాబుని ఇక్కడే ఉంచి వెళ్ళకూడదా రాజులూ! వీళ్ళతో ఆడుకుంటాడేమో!" అని, సులోచన వెంటనే, "అయినా వాళ్ళమ్మ ఎదురుచూస్తుంటారేమో, తీసుకెళ్ళు" అంది బలవంతంగా నవ్వుతూ.

"ఆవిడగోరికంత తీరికెక్కడ, తల్లీ? ఈయన్ని మళ్ళీ వచ్చి నేనే తీసుకుపోతాన్లెండి" అన్నాడు రాజులు.

"వాళ్ళ తాతగారు ఏమన్నా అనరూ?"

"ఆరితో నే చెబుతా గదండి. ఈరిని కాస్తంత సేపు ఇక్కడే ఆడనియ్యండి."

పిల్లల్ని ముగ్గుర్నీ తీసుకుని ఇంట్లోకివెళ్ళింది సులోచన. ముగ్గురికీ టిఫిను పెట్టి, కాఫీ ఇచ్చింది.

శ్రీరామ్‌చంద్ నెహ్రూ గాంధీ ఏవేవో కబుర్లు చెప్పాడు. ఆ కబుర్లు వింటూ కడుపుబ్బేలా నవ్వింది సులోచన. జ్యోతి, సుధా కూడా ఆమెతోపాటు నవ్వారు. వాళ్ళూ వయస్సులో శ్రీరామ్‌కంటే ఎక్కువ పెద్దవాళ్ళు కాకపోయినా వాడిలా మాట్లాడరు. చిన్నప్పటినించి ఒక క్రమంలో పెంచింది సులోచన. వాళ్ళల్లో వాళ్ళు గిల్లికజ్జాలు పెట్టుకుని గోల చేసినా, పెద్దవాళ్ళ ముందు ఎప్పుడో తప్ప తక్కువగా మాట్లాడతారు మామూలుగా. కానీ వీడికి మాత్రం ఏ బెరుకూ లేదు. లొడలొడ మాట్లాడాడు. పైగా, మాటల్లో అదో రకమైన యాస. సరిగా వచ్చీరాని మాటలు. సులోచనని 'మీరు' అనలేదు. 'నువ్వు' అన్నాడు. "నీ జట్టుంటాను, రోజూ టిఫిను పెడతావా?" అని అడిగాడు. "నీకు చీకట్లో భయం వేస్తే నే సాయం వస్తా" నన్నాడు. జ్యోతి, సుధ మంచివాళ్ళని యోగ్యతా పత్రాలు ఇచ్చాడు. గంటసేపూ సులోచన వాడి నంటిపెట్టుకునే వుంది. గంట తరవాత రాజులు వచ్చినప్పుడు 'అయ్యో!' అనుకుంది.

రాజులు చెమటలు కక్కుతూ వచ్చాడు. వగర్చుకుంటూ రాజుల్ని చూస్తూనే రిక్షా ఎక్కి కూర్చున్నాడు శ్రీరామ్.

"ఆరి తాతగారికి ఆరిని చూడాలని అర్జంటుగా అనిపించిందంటండి. ఎంటనే ఎల్లి తీసుకురమ్మన్నారు. మనం లగెత్తుకొచ్చాం!" అన్నాడు రాజులు.

రాజులు నవ్వుతున్నా, సులోచనకు జాలివేసింది అతని మీద.

"ఎందుకు రాజులూ, అంత శ్రమపడతావ్? నువ్వేం కుర్రాణ్ణను కుంటున్నావా? శరీరాన్ని అంత రాపిడి పెడితే రేపు నువ్వేం అయిపోతావో ఆలోచించావా?"

జాలిగా నవ్వాడు రాజులు.

"నాదేం ఉంది తల్లీ! ఈ కట్టె రేపో మాపో ఎల్లాగా రాలిపోయేదే. పోయే ముందు ఈ దేవుళ్ళకి సేవలు సెయ్యనియ్యండమ్మా" అని పిల్లలవంక చూపించాడు రాజులు. "రేపు యీ నౌరగారు పెద్దయి, పెద్ద ఉద్యోగం చేసేప్పుడు ఈ రాజులు గురించి అనుకోరంటమ్మా — 'రాజులు అలా రిక్షా ఎక్కించు కెళ్ళబట్టే నే నింతవాణ్ణయ్యాను' అని. ఏం అయ్యగోరూ! తమరు రేపు పెద్ద ఉద్యోగం చెయ్యరూ?" అని కుర్రాడి బుగ్గలు గిల్లాడు రాజులు. వాడికి ఈ ప్రసంగం అర్థంకాకపోయినా కులాసాగానే నవ్వాడు.

చందూ.... అదే, ఆ నవ్వే నన్నంతగా ఆకర్షించింది. ఇంతవరకూ ఇదో కథలా వ్రాశాను చందూ! కానీ ఇది కథ కాదు. కథలా అనిపించే గతం. ఈ కథని ఈనాడు నీకెందుకు వ్రాస్తున్నానో ఊహించే వుంటావు. ఆ శ్రీరామ్‌చంద్ నెహ్రూ గాంధీయే నువ్వు. నువ్వే, చందూ! మరి నువ్వు నాకు కొడుకువెలా అయ్యావ్? నీకు నేను అమ్మనెలా అయ్యాను? నీలో తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతూందా? కానీ.... ఈ ఉత్తరాన్ని కథలాగానే సాగిస్తాను. శ్రీరామ్ రోజూ జ్యోతి, సుధలతో పాటే రిక్షా దిగేవాడు. సులోచనకి వాడంటే మమకారం రోజు రోజుకీ ఎక్కువవుతూ వచ్చింది. వాడుండే ఆ గంటసేపు వాడితోపాటు చిన్నపిల్లలా ఆడుకునేది.

"ఈ పిల్లలు దీపాల్లాంటివాళ్ళు,రాజులూ వీళ్ళున్నచోట వెలుగు" అనేది సులోచన. రాజులు బోసినవ్వు ఆమెకు ఎంతో సంతృప్తి ఇచ్చేది.

"ఈళ్ళుకాదు, తల్లీ, దీపాలు. దీపాలు మనం. ఈ దీపాలకి ప్రాణం ఇచ్చే సమురు ఈళ్ళు" అనేవాడు రాజులు.

"మనం ముసిలాళ్ళ మయ్యిపోయాక రేపు మనల్ని సల్లగా సూసే దేవుళ్ళు ఈళ్ళు."

"నువ్వింకా ముసిలివాడివి కాలేదా, రాజులూ?" అనేది సులోచన.

"ఎదమ్మా? ఈ అయ్యగోరు పెద్దోడవందే నేనెట్టా ముసిలాడయేది? నే ముసిలాడయేపోతే ఈర్ని రిచ్చాలో ఎవరు తీసుకువెళ్ళేదీ, ఈర్ని పెద్దోర్ని చేసేదీ? ఈరు పెద్దోరైనాక...." అంటూ ఒక రంగు రంగుల వెలుగు చిత్రం గీసేవాడు రాజులు.

"రాజులూ! వీడి వయసులో నువ్వు ఏం చేసుంటావ్?" అంది ఓ రోజున సులోచన నవ్వుతూ.

"ఏం చేసుంటాను, తల్లీ? సేపలు పడ్తానో, మట్టిలోనో, నీల్లలోనో పొర్లతా ఉండేటోణ్ణి. నేను నయంకాదు, తల్లీ! నా వయసు కుర్రోళ్ళు శానామంది ముష్టి అడుక్కుంటూ, ఊరంతా తిరిగేటోరు పాటలు పాడతా. ఆళ్ళే నెమ్మది నెమ్మదిగా సిన్న దొంగతనాలు సేసేటోళ్ళు. ఆళ్ళలో కొందరు పెద్దోళ్ళయి గజదొంగలయినారు. మరికొందరు ముష్టోళ్ళుగానే వుండిపోయారు. నిజం సెప్పమంటావా,తల్లీ! మా అయ్యా మా అమ్మ కూడా అదే పని సేసేటోరు. నే పుట్టిందెక్కడనో సెప్పనా!

పేచ్‌మెంటుందదామ్మా, అక్కడ. నా కదే బతుకవాలిసింది. కాని, నాకు చిన్నప్పుడు బిచ్చం అడగడం చేతనయ్యేది కాదు. రోజంతా తిరిగినా ఓ అర్ధణా డబ్బులు దొరికితే గొప్పే. ఓ రోజున ఒకాయన నన్ను పిల్చి కారు తుడిస్తే, పావలా యిస్తానన్నాడు! ఓ గంట కష్టపడగానే పావలా దొరికింది! ఆ తరువాత బస్ డిపో దగ్గిర క్లీనర్‌గా కొంతకాలం పని చేశానమ్మా. కొంతకాలం బియ్యం బస్తాలు కూడా మోశాను. ఆ తరువాతే రిక్షా లాగే పనికి దిగింది. మొదట్లో ఈ సైకిల్ రిక్షా లేదవమ్మా! పరిగెట్టి లాగే బళ్ళుగా అవన్నీ. దాన్నించి మళ్ళీ జట్కాబండి నడిపేవోణ్ణి కొంతకాలం. ఆకిరికి ఈ సైకిల్ బండి దగ్గిర కొచ్చాను. ఏం తల్లీ, నా బ్రతుకులో కూడా చిన్న ఉద్యోగంలోంచి పెద్ద ఉద్యోగంలోకే వచ్చాను" అని పెళ్ళున నవ్వాడు రాజులు.

రాజులు మాటల్లో తన బ్రతుకు బరువూ, నికృష్టం అయిందనే బాధ ఉందో లేదో సులోచన కేనాడు సరిగా అర్థం కాలేదు.

అతని జీవితంలో ఏపాటి సుఖమూ ఎరగడన్నది తెలుస్తూనేవుంది. కాని, అతని మనస్సులో ఆనందం మాత్రం లేకుండా పోలేదు.

రాజులు గమ్మత్తయిన మనిషి. నవ్వునీ, బాధనీ కలిపి మాట్లాడేవాడు. తరాల తరబడి దరిద్రం అనుభవించినవాళ్ళలో అటువంటి విషాద హాస్యానికే చోటు అనిపించేది సులోచనకి. కానీ రాజులు నిజమైన అంతరంగం ముందు ముందు బోధపడింది ఆమెకు.

"రాజులూ! నీ చిన్నప్పుడు నీకు కూడా ఎవరైనా చదువుచెప్పించి ఉంటే...."

"ఎవరైనా సదువ్ సెప్పించుంటే, హైకోర్టు జడ్జీనై, చందమామలాంటి పెళ్ళాన్ని తెచ్చుకోని నక్షత్రాల్లాంటి పిల్లలికి తండ్రినై, మయసభలాంటి బవనం కట్టేవోణ్ణి. నేం సచ్చిపోయినప్పుడు ఊరంతా సంతర్పణ చేయించేవోణ్ణి. ఏమంటావు, తల్లీ?" అనేవాడు రాజులు పెద్దగా నవ్వుతూ.

అలా రాజులూ, శ్రీరాం కూడా సులోచన జీవితంలో భాగం అయిపోయారు.

"రాజులూ, వీళ్ళమ్మగారిని ఓసారి చూడాలి" అంది ఓ రోజున సులోచన.

"ఏం చూస్తారు తల్లీ? ఆడదగానికి తీరికేదీ? అసలు ఈరిని ఎవరయినా పెంచేసుకుంటే ఆరు సుకపడిపోతారు" అన్నాడు రాజులు.

శ్రీరాం సులోచనకు ఎంత దగ్గిరయ్యాడో, వాడిని గురించిన తాపత్రయం కూడా అంత ఎక్కువయింది ఆమెకు.

చందూ! అలా పది నెలలు గడిచిపోయాయి. ఓ రోజున ఏమైందో తెలుసా....

ఆ రోజు పిల్లల బడికి వేసంగి సెలవులిచ్చే రోజు. పరీక్షలయిపోయి వారంరోజులయింది. పిల్లల ఫలితాలు చెప్పే రోజు కూడా అదే. వాళ్ళ బడిలో ఆనవాయితీ ప్రకారం తల్లో, తండ్రో ఆ ఫలితం తెలుసుకునేందుకు బడికి వెళ్ళాలి.

ఆ రోజు పొద్దున్నే వచ్చి మామూలుగా పిల్లల్ని బడికి తీసుకువెళ్ళాడు రాజులు.

"ఈరోజైనా శ్రీరాం వాళ్ళమ్మ వస్తారా, రాజులూ!" అని అడిగింది సులోచన.

"ఏమోనమ్మా, అరిష్టం. నేను పన్నెండు గంటలకొచ్చి మిమ్మల్ని తీసుకెళ్తనా, తల్లీ!" అన్నాడు రాజులు.

"సరేలే, రాజులూ! పోనీ, వాళ్ళ తాతగారినయినా రమ్మనరాదా, రాజులూ!" అనడిగింది సులోచన.

"ముసలాయన, ఆయనేం వస్తారు, తల్లీ?" నవ్వాడు రాజులు.

రాజులు పన్నెండు గంటలకి వచ్చాడు ఖాళీ రిక్షాతో.

ఎండ మండుతూంది. అతని ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అయినా ఎందుకో చాలా హుషారుగా ఉన్నాడు.

అప్పుడే గమనించింది సులోచన. రాజులు చాలా బలహీనంగా కనిపించాడు.

"రాజులూ! ఈ పూట రిక్షా తొక్కద్దు నువ్వు. చాలా అలిసిపోయి ఉన్నావు" అంది సులోచన.

"ఓవ్, అదేం లేదమ్మా. ఈ రాజులు గుండెలో బలం ఉండగా, ఒళ్ళు అలిసినా భయంలేదు, తల్లీ."

"పోనీ, కాస్త మజ్జిగదాహం పుచ్చుకో" అని బ్రతిమాలింది సులోచన. కాదనలేకపోయాడు రాజులు.

సులోచనని తీసుకెళ్ళి బడిదగ్గిర దిగబెట్టాడు. మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళాడు. ఎందుకో గుంభనంగా నవ్వుతూన్నాడు.

సుధ, శ్రీరాం ఒకటోక్లాసు పాసయ్యారు. జ్యోతి మూడులోకి వచ్చింది.

శ్రీరాం కార్డు కూడా సులోచనకే ఇచ్చింది టీచరు.

ఆ కార్డు చదివి సులోచన ఆశ్చర్యపోయింది.

కుర్రవాని పేరు: శ్రీరాంచంద్. తండ్రి పేరు లేదు. తల్లి పేరు: లేదు.

"సంరక్షకుని పేరు : రాజులు...." అని వుంది.

రాజులు కోసం బయటికి వచ్చింది సులోచన.

దూరాన రాజులు రిక్షా తొక్కుకుంటూ వస్తున్నాడు. 'ఇలా ఎందుకు చేశాడో అడగాలి' అనుకుంది కోపంగా సులోచన.

కుడివైపు నుంచి ఓ లారీ దూసుకుంటూ వచ్చింది. ఎడంవైపుకు తిప్పబోయి ఓడిపోయాడు రాజులు.

అంతా కనురెప్పపాటులో జరిగి పోయింది. రిక్షా మీదకి వచ్చేసింది లారీ.

రాజులు రోడ్డు మీదకి ఉరకబోయి బోర్లా పడిపోయాడు. గుండె ఆగిపోయింది. రాజులు చచ్చి పోయాడు.

సులోచనకి దుఃఖం ఆగలేదు.

సుధ, జ్యోతితో పాటు శ్రీరామ్‌ని కూడా ఇంటికి తీసుకు వచ్చింది సులోచన.

అది, చందూ.... రాజులు చెబుతూండే శ్రీరామ్‌చంద్ నెహ్రూ గాంధీవే నువ్వు. రాజులు నీకు తాత. మీ అమ్మ అంట్లుతోమేది. మీనాన్న ఏదోకార్ఖానాలో పనిచేసే వాడట. వాళ్ళిద్దరూ నీ రెండవ ఏటనే కలరాకు బలి అయిపోయారు. రాజులు కూడా పోవడంతో నువ్వు మావాడివయ్యావు. మీ నాన్న గారు అదే ఆయన.... నా మాట తీసెయ్యలేదు. నువ్వు నా ముద్దుల తండ్రివయ్యావు రాజులుగమ్మత్తు మనిషి. ఓనిమిషం బాధతో, ఓ నిమిషం ఆనందంతో ఉండేవాడు. ఒకప్పుడు రెండూ కలిపేసేవాడు. ఒకసారి మామూలుగా మాట్లాడేవాడు మరోక్షణం యాసగా మాట్లాడేవాడు. తను బ్రతికి ఉన్నంత కాలం నువ్వెవరో నాకు తెలియకుండా చాలా జాగ్రత్త పడ్డాడు. నిన్ను మరో ప్రపంచంలోకి ప్రవేశపెట్టడానికి ఎంతగానో తాపత్రయ పడ్డాడు. తన తండ్రి ముష్టివాడు. తను రిక్షా లాగేవాడు తన కొడుకు కార్ఖానాలో మెకానిక్. తన మనమడు పెద్ద చదువు చదివి, పెద్ద ఉద్యోగం చెయ్యాలనే తపన రాజులుకి. అందుకే నిన్ను బళ్ళో వేశాడు.

చందూ.... నిన్ను దరిద్రం నుంచి దూరంగా ఉంచాలని తను మరింత దరిద్రంలోకి జారిపోయాడు. నీ రేపటి సుఖం కోసం తన రోజులెన్నో ధారపోశాడు. నిన్ను గొప్పింటి వాడుగా మా యింట్లో పరిచయం

(మిగతా 29 వ పేజీలో)

అని అడిగాడో పాత్రికేయ మిత్రుడు. అంత చెత్త సినిమా అది. దానికి ఆత్రేయ 'లేదు నాయనా.. భరించా' అన్నారు తడుముకోకుండా.

మరోసారి ఆత్రేయగారు తన అడ్రను ఇంకో పాత్రికేయ మిత్రుడికి రాసి ఇచ్చేరు. అది చూసి అతను "అరె... ఇది సుశీలగారు ఉండే వీధే కదండీ.. ఆవిడ మీ ఇంటికి దగ్గరేనా?" అని అడిగారు. "అవును.. ఇది వరకు ఆవిడ మా పక్కింటి అమ్మాయి, ఇప్పుడు ఎదురింటి అమ్మాయి" జవాబిచ్చారు ఆత్రేయ చమత్కారంగా.

"అంటే.. ఆవిడ మరేరా... మీరు మారేరా?" తిరిగి ప్రశ్నించాడు మిత్రుడు.

"మారేదెవ్వరూ ఆడవాళ్ళే... ఊ...ఊ...ఊ మ్మగవాళ్ళు మారరు" అని అన్నాడు ఆత్రేయ అక్కినేని నాగేశ్వరరావుగార్ని ఇమిటేట్ చేస్తూ.

ఆత్రేయ అంటే చంద్రుడు అని అర్థం. అది తెలియని ఒకాయన 'ఆత్రేయ అంటే ఏమిటండీ?' అని అడిగాడు. దానికి ఆత్రేయ సమాధానం– 'రాత్రేయుడు'

ఆత్రేయ 'వాగ్దానం' చిత్రాన్ని డైరెక్ట్ చేసే రోజుల్లో ఈసారి సెట్‌లో అక్కినేని నాగేశ్వరరావుగారితో సహా అందరూ రెడీ అయి కూర్చున్నారు. ఆత్రేయగారు మాత్రం ఎక్కడా అయిపులేరు. ఆఖరికి అక్కినేని అటూ ఇటూ తిరిగి ఆత్రేయని పట్టుకున్నారు. ఎవరికీ కనిపించకుండా ఓ మూల కూర్చుని అప్పుడు చిత్రీకరించవలసిన డైలాగులు రాసేసుకుంటున్నాడాయన.

"ఏంటండీ ఇది... ఏంటి పని?" అని మందలించారు అక్కినేని.

"అదికాదు నాగేశ్వరరావుగారూ... అందరికీ లేటుగా ఇచ్చి నా సినిమాకి నేను ముందుగా డైలాగులు రాసేసుకుంటే 'స్వార్థం' అని ప్రొడ్యూసర్లు తిట్టుకోరూ... ఆ పార్షియాలిటీ లేకుండా జాగ్రత్త పడుతున్నానండీ" అన్నాడాయన నన్నుత్తన్న నవ్వుని అనుకుని సీరియస్‌నెస్ మొహం మీదకు తెచ్చేసుకుంటూ.

ఆత్రేయగారు రాసుకునే టైము తెల్లవారు జామున మూడు లేక నాలుగు గంటలకి. రాసిన వాటిని తెలుగులో టైపు చెయ్యడానికి ఓ అసిస్టెంట్‌ని పెట్టుకున్నాడు. ఈయన రాసి పంపిస్తూనే ఉన్నాడు. పక్కగదిలోంచి టైపు శబ్దం అస్సలు వినిపించడం లేదు.

'ఏం టైపు చేస్తున్నావ్?' అరిచారు ఆత్రేయ

'సీవ్లండీ' అన్నాడతను ఉలిక్కిపడి లేచి.

'అదే ఏ సీవ్లో అని..? అసలు శబ్దమే వినిపించడం లేదు'

'సైలెంట్ సీవ్లండీ' అన్నాడా అసిస్టెంట్ బహు చమత్కారంగా.

ఆత్రేయతోటి సాంగత్య వైభవం అంతటిది మరి.

ఆత్రేయ రాయకుండా ప్రొడ్యూసర్లని, రాసి ప్రేక్షకులని ఏడిపిస్తారని ఓ సినీ సూక్తి. దాని గురించి ఆయనతో ప్రస్తావిస్తే "రాస్తూ నేనెంత ఏడుస్తానో ఎవడికి తెలుసు" అంటుండేవారు ఛలోక్తిగా.

అలాగే "మీరు మనసు మీదనే ఎక్కువ రాస్తారెందుకండీ?" అని అడిగితే 'మనసు మీద మనసుపడ్డా నాయనా' అంటుండేవారు పర్మగర్వంగా.

చివర్లో చెప్పుకోవలసింది, కళ్ళను చెమ్మగిల్లేట్టు, మనసును గిల్లేట్టు చేసే ఓ జోకు ఆయనది ఉంది.

"నాకూ, చావుకి అస్సలు పడదు. నేనున్న దగ్గరికి అది రాదు. అదొస్తే నేనుండను" అదీ ఆత్రేయంటే!

ఆత్రేయ జీవకవి. మనిషి మనసులో మమత చావనంత వరకూ అనుక్షణం ఓ అనుభూతిగా ఆయన పుదుతూనే ఉంటాడు. అందుకే ఆత్రేయ స్మరణీయుడు, తెలుగు పాటలో భావం ఉన్నంత వరకు స్వరస్మరణీయుడు, తెలుగు తెర మీద తెలుగుదనం ఉన్నంత వరకూ తెరస్మరణీయుడు.

–రాజా

(రేపు -- 25 పేజీ తరువాయి)

చేశాడు. నిన్నలా పోషించడానికి ఎంత డబ్బయిందో? అదంతా రిక్షాలాగి సంపాదించిన డబ్బు. రక్తం పిండి, కడుపు కాల్చుకుని పోగుచేసిన డబ్బు.

చందూ!.... నీ ఉత్తరం చూశాను. ఆ ఉత్తరమే రాకపోతే నీకీ విషయాలు ఎన్నడూ చెప్పేదాన్ని కాదు. ఈ విషయాలు తెలిశాక నువ్వు నన్ను నీ తల్లిలా చూడలేవు. ఆ సంగతి తెలుసు. ఆ గుండెకోత తెలుసు. అది అనుభవించిన వాళ్ళకే అర్థమవుతుంది, చందూ! అయినా చెప్పాను.

చదువు మానేస్తానని కదూ వ్రాశావు?

చిన్ననాటి వాడు కనక నువ్వు రాజుల్ని మరిచిపోయావు. కానీ నేనెలా మరిచి పోతాను?

ఒరేయ్, నీ చిన్నప్పుడు రాజులు కలలు కని, రంగులతో గీసిన చిత్రం ఆ రేపు.... ఈ రోజున వచ్చిందిరా. దానికోసమే తన రోజులెన్నో పోగొట్టుకున్నాడురా రాజులు. చందూ, నీ ఆవేశం నాకు అర్థం కాలేదనుకోకు. అక్కడ జనాన్ని బాధలు పెడుతున్నారని, ఇక్కడ నువ్వు అల్లర్లు లేవతీద్దామనుకుంటున్నావా? అక్కడ తెలంగాణాలో నలిగిపోతున్నది ఆంధ్రులు మాత్రమే కాదురా. వాళ్ళూ వీళ్ళూ అనకుండా సామాన్య జనం అందరూ దుమ్మై పోయార్రా!

ఇప్పుడు ఆంధ్రా విడిపోవాలని మీరంతా అక్కడ గొడవ మొదలు పెడితే మరికొందరు దురదృష్టవంతులు నాశనమై పోతారు.

నువ్వన్నది నిజమే, చందూ! దరిద్రం, అజ్ఞానం నగ్నంగా సంచరిస్తున్నాయి మన దేశంలో.

కానీ అల్లర్లూ హాహాకారాలు చేస్తే బాగుపడే దెవరు?

ఓ మనిషిని పేదరికంలోంచి లేవదియ్యాలంటే ఒక రోజుతో అయిపోతుందనుకుంటున్నావా? ఓ రాష్ట్రం ఒకటి వేరే సంపాదిస్తే సౌభాగ్యం మనని వెతుక్కుంటూ వస్తుందనుకుంటున్నావా? ఆవేశంతో అరిస్తే దరిద్రుడి ఆకలి తీరుతుం దనుకునేంత వెర్రివాడివా నువ్వు?

ఒక చిన్న కథ చెప్పనా, చందూ?

వెనకటి కొక రాజ్యం ఉండేది. ఆ రాజ్యాని కో రాజుగారు. ఆ రాజ్యంలో ఓ చీమల పుట్టలో ఉన్న చీమల్లో ఓ చీమకి ఓ రోజున ఓ బెల్లం ముద్ద కనపడింది. ఆ సంగతి అది పుట్టలోకి వచ్చి చెప్పింది. ఆ పుట్టలో రెండు వర్గాల చీమలున్నాయి. ఒక వర్గం పేరు ఉద్రేక వాదులు, మరో వర్గం పేరు శాంత వాదులు. వీళ్ళనే అభివృద్ధి వాదులని కూడా అనేవారు.

ఆ బెల్లం ముద్దని కొద్ది కొద్దిగా మన పుట్టకి తెచ్చుకుందాం అన్నారు శాంత వాదులు.

"కాదు, మనమే ఆ భవనాన్ని ఆక్రమించుకుందాం, అందులో ఉన్న జనాన్ని బయటికి తరిమి" అన్నాయి ఉద్రేక వాదులు.

ఉద్రేక వాదుల మాటే నెగ్గింది. కోట్ల కొలది ఉద్రేక వాదులు ఆ బెల్లం ముద్ద ఉన్న ఇంటిమీదకి దాడి చేశారు. ఇల్లంతా అయిదంగుళాల మందాన ఎక్కడ చూసినా చీమలే. చీమల సముద్రంలా ఉందది. ఆ ఇంట్లో మనుషులు ఆ చీమల్ని చంపేందుకు ప్రయత్నించి విఫలులయ్యారు. ఇంట్లో ఉండడం కష్టం అయిపోయింది వాళ్ళకి. ఇల్లు వదిలి బయటికి వెళ్ళారు. గుండెలు చరుచుకున్నాయి చీమలు.

మరునాడు రాజుగారి మనుషులు వచ్చారు. గంగాళాలతో ఉడుకు నీళ్లు తెచ్చి ఇంటి నిండా పోశారు. ఆ నీళ్ళలో ఉడికిపోయి, ఒక్క చీమ లేకుండా అన్నీ చచ్చిపోయాయి.

అంతేకాదు, రాజుగారి మనుషులు ఆ చుట్టుపట్ల ఉన్న చీమల పుట్టల్ని ఒక్కటి విడవకుండా తగలబెట్టేశారు.

అది, చందూ, కథ.

ఆలోచించు. మన రాజులు ఎదురు చూసిన రేపు దూరంలో లేదు.

ఆ రేపు చూడదలుచుకున్నావో, లేదో నీ ఇష్టం.

నా మాటకు నువ్వు విలువ ఇస్తావనే ఆశిస్తాను.

నీలాంటి వాళ్ళ రేపే ఈ దేశానికి రేపు....

ఉత్తరం పూర్తి చేసి, కాగితాలు మడిచి కవర్లో పెట్టి, లైటార్పి పడుకుంది సులోచన.

ఈ ఉత్తరం అందుకున్న సమయంలో శ్రీరామ్‌చంద్ జబ్బకు బుల్లెట్ దెబ్బ తగిలినందువల్ల హాస్పిటల్ బెడ్డుమీద ఉన్నాడు....

(ఈ కథ సీయస్సీ మురళి గారి 'వర్షంలో మనిషి' కథాసంపుటి నుండి రచయిత సౌజన్యంతో పునర్ముద్రింపబడినది.......................... కి.ర )